పర్మిషన్ ఒకలా.. నిర్మాణం మరోలా..!

- మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు
- జీ ప్లస్ టు అనుమతి తీసుకొని జీ ప్లస్ ఫైవ్ వరకు పనులు
- జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండి

మైలార్‌దేవ్‌పల్లి: జీహెచ్‌ఎంసీ ఆదాయానికి కొందరు భవన నిర్మాణ యజమానులు గండికొడుతున్నారు. అనుమతులు ఒకలా తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా మరొకలా నిర్మాణం చేపడుతున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మధుబన్ కాలనీ, లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ, బుద్వేల్ , కాటేదాన్ ప్రాంతాల్లో ఇష్టానుసారంగా ఇండ్లను నిర్మిస్తున్నారు. 200 గజాల స్థలంలో ఏకంగా 5 నుంచి 6 అంతస్తులు వరకు నిర్మిస్తున్నారు. పట్టించుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 300 గజాల్లో సెల్లార్లు తవ్వి బహుళ అంతస్తులు సైతం నిర్మిస్తున్నారు. జీ ప్లస్ టు పర్మిషన్ తీసుకొని జీ ప్లస్ ఫైవ్ కడుతున్నారు. అనుమతి మేరకే ఇండ్లు నిర్మించుకోవాలని కానీ ఇక్కడ నిబంధనలు పాటించకుండా ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా కడుతున్నారు. మరికొందరు అసలు అనుమతులు తీసుకోకుండానే గృహాలు నిర్మిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండి పడుతున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. నిబంధనలు పాటించకుండా భవనాలు నిర్మిస్తున్నారని పలువురు స్థానికులు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు వచ్చి చూసి యజమానితో మాట్లాడి వెళ్లిపోతున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో జీ ప్లస్ 5 పెంట్‌హౌస్‌కు సెట్ బ్యాక్ లేకుండా ఇష్టానుసారంగా ఓ బిల్డర్ నిర్మిస్తున్నాడు. అలాగే మధుబన్‌కాలనీలో 250 గజాల స్థలంలో జీ ప్లస్ 4 స్లాబు వేస్తున్నాడు. నిబంధనలు పాటించకుండా సెట్ బ్యాకు లేకుండా నిర్మిస్తున్నాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డ్ కాలనీలో..



బుద్వేల్ వెంకటేశ్వర కాలనీలో..



మధుబన్‌కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తు

నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటాం..



పర్మిషన్ తీసుకుని నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపట్టినవారిపై చర్యలు తీసుకుంటాం. సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు 100 పైగా ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపట్టినట్లు జీహెచ్‌ఎంసీ గుర్తించింది. ఈ విషయమై టౌన్ ప్లానింగ్ అధికారులు, ఎస్‌టీఎఫ్ టీంలను రంగంలోకి దించాం. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశాం. నోటీసులు జారీ చేసి నిర్మాణాలు కూల్చే విధంగా ఎస్‌టీఎఫ్ టీంను పంపిస్తున్నాం. భవనాలు నిర్మించేముందే యాజమాన్యాలు పర్మిషన్ తీసుకోవాలి.

–రవికుమార్, రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్

యువజన కాంగ్రెస్ విభాగం నిరసన



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యువజన కాంగ్రెస్ నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఇండియన్ యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ, ఇండియన్ నేషనల్ అన్ని ఖాతాలను స్తంభింపజేసిందని ఇది పూర్తిగా పాలక ప్రభుత్వం గుండాయిజమని మండిపడ్డారు. ఇక మోదీ ఆగడాలు చెల్లవని రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, రాజేంద్రనగర్ గ్రామ అధ్యక్షుడు శ్రీకాంత్, ఎర్రబొడ విలేజ్ అధ్యక్షుడు భరత్ రెడ్డి, రాజేంద్రనగర్ సీనియర్ నాయకులు నారాయణ ముదిరాజ్, ఝాన్సీ, జంగన్న, ఉమర్, పుస్తకాల ప్రశాంత్, రాజేంద్రనగర్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ముదుమాల శ్రీకాంత్, బబ్లూ, చెరుకుల రవి, కార్యదర్శులు మనోహర్, చందు, రఫీక్, రాజేంద్రనగర్ యువ నాయకులు శంకర్, సందీప్, మహేశ్, నిఖిల్, వంశీ, సాయి, మహేశ్, బాలు, వినయ్, రజినీ, కార్తీక్, మైనార్టీ నాయకులు ఫిరోజ్, గౌస్ పాల్గొన్నారు.

చేవెళ్లలో బీజేపీదే విజయం

శంషాబాద్: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు దేవేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మాటలను ఓటర్లు నమ్మే స్థితిలో లేరన్నారు. ఆ రెండు పార్టీలు స్కామ్‌ల్లో పీకల్లోతుల్లో మునిగిపోయాయని ఆరోపించారు. బూత్ స్థాయిలో ప్రతి కార్యకర్త ప్రజలందరూ కమలం గుర్తుకు ఓటు వేసేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు డాక్టర్ ప్రేమ్‌రాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్, మణికొండ వైస్ చైర్మన్ నరేందర్, కౌన్సిలర్ ప్రవీణ్‌గౌడ్, సీనియర్ నాయకులు వై. శ్రీధర్, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడి. విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సమావేశం



నూతన ఆవిష్కరణలను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలో పశు సంవర్ధక విభాగం ఆధ్వర్యంలో 'సుస్థిర పాడి పశువుల ఉత్పాదకత పెంపొందించేందుకు సమగ్ర పోషణ యజమాన్య పద్ధతులు' అనే అంశంపై శుక్రవారం రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆధార్ సిన్హా హాజరై పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు విశ్వవిద్యాలయ పరిశోధనలను రైతులకు చేరవేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఐసీఆర్‌ఓ డైరెక్టర్ రాజీవ్ రంజాన్ మాట్లాడుతూ పశు పోషణ, వ్యవసాయ రంగాల్లో పరిశోధనలు విస్తృత పరచాలని ప్రతి విద్యార్థి ఒక పారిశ్రామికవేత్తగా మారేందుకు కృషి చేయాలని సూచించారు. జాతీయ ఉత్పాదక మండలి డైరెక్టర్ హైమంత్ కుమార్ పశు ఉత్పాదక పెంపొందించే ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో పశువైద్య విశ్వవిద్యాలయం అధికారులు, విద్యాలయ పరిశోధక విద్యార్థులు, పశు సంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

‘సీబీఐటీ’లో ప్రపంచ జల దినోత్సవం



నీటి పొదుపుపై సీబీఐటీలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో ప్రపంచ జల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో గల చైతన్య పరివృత, పర్యావరణ క్లబ్ ఆధ్వర్యంలో నీటి సంరక్షణ, స్థిరమైన నీటి వినియోగ పద్ధతుల ప్రాముఖ్యతను తెలియజేసేలా అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కె.జగన్నాథరావు మాట్లాడుతూ నీటిని ప్రతిఒక్కరూ పొదుపుగా వాడాలన్నారు. స్థిరమైన భవిష్యత్‌ను నిర్మించడంలో నీరు ప్రధాన ఆధారమని, దాని విలువ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఇప్పటికే కొన్ని దేశాలు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, మనం భూమి నుంచి ఎంత నీటిని తీసుకుంటున్నామో అంతే స్థాయిలో తిరిగి భూమిలోకి పంపడం కూడా బాధ్యతగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ మహేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ కొత్త కమిటీలు ఏర్పాటు చేయాలి



మణికొండలో నిర్వహించిన బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

మణికొండ: మున్సిపాలిటీల్లో పనిచేసే వారికి కాకుండా మెహర్బానీలు చేసే వారికి పార్టీ పదవులు ఇచ్చారని, కీలక సమావేశాలతో పాటు పార్టీ కార్యక్రమాలకు వారు హాజరుకారని అలాంటి వారిని తొలగించి నూతన కమిటీలు ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల బీజేపీ అధ్యక్షులు సి.బీరప్ప, సీహెచ్. భిక్షపతియాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాలకు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మణికొండ మున్సిపాలిటీ ఇన్‌చార్జి వై. శ్రీధర్, జోగి రవి, నార్సింగి మున్సిపాలిటీకి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మున్సిపాలిటీ ఇన్‌చార్జి నందకిశోర్ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పదవులు పొందిన వారు పార్టీకి ఏమాత్రం పనిచేయడం లేదని, వారిని తొలగించి కొత్త కమిటీలు వేస్తే నాయకులు, కార్యకర్తలకు ఉత్సాహం వస్తుందన్నారు. అలాగే ప్రతి బూత్‌లో వీలైనన్ని కొత్త ఓటర్లను నమోదు చేయించాలని సూచించారు. ఆయా సమావేశాల్లో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కె. నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ మోర్చా నాయకుడు సత్యనారాయణ, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. నగేశ్‌యాదవ్, బుచ్చిరెడ్డి, బాబురావు, కౌన్సిలర్లు ఆదిత్యరెడ్డి, శ్రీకాంత్‌స్వామి, వందననగేశ్, శ్వేతారవికాంత్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు జె.సిద్ధప్ప, జె. లక్ష్మీరాములు, నాయకులు ఎం.రాఘవరెడ్డి, సీహెచ్. ఇందిర, కె.నర్సయ్యచారి, కె.శ్రీనివాస్‌రెడ్డి, శివరాజ్, డి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మణికొండ: పిల్లలు, మహిళలకు సరైనా పోషకాహారం అందించినప్పుడే వారు ఆరోగ్యంగా ఉంటారని గండిపేట మండల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మణెమ్మ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పోషణ పక్షోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. పోషకాహార లోపం ఉంటే అనేక రోగాల బారిన పడుతారన్నారు దవాఖానల్లో డబ్బులు ఖర్చు చేసే బదులుగా బలవర్ధక, అన్ని రకాల పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాలు, పాలు, గుడ్లు, ఆకుకూరలు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అలాగే పోషక విలువలు ఉన్న ఆహారాల పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఇ.ఇందిర, ఆర్. సౌభాగ్య, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

సహకార సంఘం సర్వ సభ్య సమావేశం

బండ్లగూడ: రంగారెడ్డి జిల్లా సహకార మార్కెటింగ్ సర్వ సభ్య సమావేశాన్ని రాజేంద్రనగర్‌లోని ఐసీఎంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సహకార సంఘం డీసీసీబీ చైర్మన్ కొత్తకుర సత్తయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాండూర్ ఎమ్మెల్యే, మాజీ డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీసీబీ చైర్మన్‌గా తాను మూడేళ్లుగా మంచిగా పని చేసినందుకే ప్రజలు, రైతులు, పాలకవర్గం సభ్యులు నన్ను ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. జిల్లాస్థాయిలో అనుకూలమైన స్థలంలో డీఎస్‌ఎంఎస్, డీసీసీబీ భవనం విషయమై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి నిర్మాణం చేపట్టేందుకు అన్ని విధాలా సహకరిస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డిని హైదర్షాకోట్ పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్ శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ కృష్ణారెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, సతీశ్, మధూకర్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘శ్రీదేవి’లో టెక్నికల్ ఫెస్ట్



టెక్నికల్ ఫెస్ట్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న గోవర్ధన్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో 'విద్ యూత్-2024 టెక్నికల్ ఫెస్ట్'ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూ సీనియర్ ప్రొఫెసర్ గోవర్ధన్ హాజరై మాట్లాడుతూ ఫెస్ట్‌లతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, నూతన ఆలోచనలు, అనుభవాల మార్పిడి జరుగుతుందన్నారు. గతంలో నిర్వహించిన 'విద్ యూత్ 3.0'కు అద్భుతమైన స్పందన వచ్చిందన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న 4.0 ఫెస్ట్‌కు 4 టెక్నికల్, 4 నాన్ టెక్నికల్ ఈవెంట్లలో పాల్గొనేందుకు 500 మంది విద్యార్థినులు రావడం శుభ పరిణామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నర్మద మాట్లాడుతూ విద్‌యూత్ అంటే ఓ స్పార్క్‌ని సూచిస్తుందని, వారి పరిజ్ఞానం, వినూత్న స్ఫూర్తితో ప్రపంచాన్ని ప్రకాశవంతం చేసేందుకు యువ ఇంజినీర్లకు శక్తిని ఇస్తుందని తెలిపారు. కళాశాల డీన్స్, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

‘మహావీర్’లో ప్లేస్‌మెంట్ డ్రైవ్



అమెజాన్‌కు ఎంపికైన విద్యార్థులతో కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: బండ్లగూడలోని మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ప్రముఖ ఐటీ కంపెనీ అమెజాన్ శుక్రవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ సంరెడ్డి ప్రమోద్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనంజయ్‌రెడ్డి మాట్లాడుతూ బీటెక్ ఫైనలియర్, డిప్లొమా తృతీయ సంవత్సరం అన్ని బ్రాంచ్‌ల విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించగా తొమ్మిది మంది విద్యార్థులు జాబ్‌కు ఎంపికవ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఉషాశ్రీ, టీపీవో డా.ఎంవి సుబ్బారెడ్డి, అసిస్టెంట్ టీపీవో శ్రీమతి మృదులను యాజమాన్యం అభినందించింది.

ఎంజీఐటీలో ఘనంగా క్రీడా దినోత్సవం



క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అరుణకుమారి

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో రెండు రోజులుగా కొనసాగుతున్న వార్షికోత్సవ సందడి నిర్వాణ-2024లో భాగంగా శుక్రవారం ట్రెడిషనల్ డే, క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ట్రెడిషనల్ డ్రెస్సుల్లో సందడి చేశారు. అంత్యాక్షరి, బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్, షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్‌లలో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా జేఎన్‌టీయూ పరీక్షల విభాగం సంచాలకురాలు ఎ. అరుణకుమారి మాట్లాడుతూ విద్యార్థులు టీం స్పిరిట్‌ను అలవర్చుకోవాలన్నారు. జీవితంతో పాటు క్రీడల్లోనూ అది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు రవికుమార్ మాట్లాడుతూ నేటితరం విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగం తగ్గించి చదువుతో పాటు క్రీడలకు సమయం కేటాయించాలని సూచించారు. ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి, నిర్వాణ-24 వైస్ చైర్మన్ డాక్టర్ కె. రామాంజనేయులు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బార్నాబాస్, పరీక్షల విభాగం డైరెక్టర్ కె.అంకమ్మరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 1 నుంచి శిక్షణ తరగతులు

శంషాబాద్: పట్టణంలోని క్రీడా మైదానంలో గల వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఏప్రిల్ 1 నుంచి ఐదో బ్యాచ్‌కు శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, గార్మెంట్ తయారీ, ఎంఎస్ ఆఫీస్, మూడు నెలల శిక్షణ కోర్సును అందించనున్నట్లు పేర్కొన్నారు. కనీస అర్హత ఏడు, పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440788502 లో సంప్రదించాలని సూచించారు.

దేవాదాయ శాఖ భూమి కబ్జాకు చెక్

- 'సాక్షి' కథనంతో కదిలిన అధికార యంత్రాంగం
- ఆలయ స్థలంలో నిర్మించిన ప్రహరీ కూల్చివేత
- క్రిమినల్ కేసు నమోదు
- అనుమతులు ఇవ్వొద్దని పలు శాఖలకు లేఖలు



దేవాదాయ శాఖ భూమిగా సూచిస్తూ బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

మణికొండ: దేవాదాయ శాఖ భూమి కబ్జాకు గురికాకుండా అధికారులు అడ్డుకున్నారు. గండిపేట మండలంలోని మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 112, 116, 125లలో 28.24 ఎకరాల భూమి గణేశ్ ఆలయం పేరిట ఉంది. పక్కనే ఉన్న తుల్జారాంబాగ్ ఆలయానికి అర్చకులుగా పనిచేస్తున్న వారు ఓ రియల్టర్‌కు సదరు భూమిని 1990లో విక్రయించారు. దాంతో అది లేఅవుట్ చేసి ప్లాట్లను విక్రయించారు. ఇంకా 8 ఎకరాల భూమి వరకు ఖాళీగా ఉండడంతో దానిని కూడా ఈ మధ్య ప్రహరీ నిర్మించి కబ్జా చేసేందుకు యత్నించారు. ఈ విషయాన్ని ఈ నెల 16వ తేదీన 'సాక్షి' దినపత్రిక 'దేవుడి భూములకే ఎసరు' అనే శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో అదే రోజు స్పందించిన దేవాదాయ శాఖ కమిషనర్, గండిపేట తహసీల్దార్ వారిపై నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు భద్రత కల్పిస్తే ప్రహరీని కూల్చివేస్తామని కోరారు.

తొలగించిన ప్రహరీ..

దేవాదాయ, రెవెన్యూ శాఖల కోరిక మేరకు నార్సింగి పోలీసులు శుక్రవారం భద్రత కల్పించడంతో ఉదయాన్నే తుల్జారాం ఆలయం వద్దకు చేరుకుని దేవాదాయ శాఖ భూమి చుట్టూ ఏర్పాటు చేసిన ప్రహరీని తొలగించారు. సదరు భూమి దేవాదాయ శాఖకు చెందిందని, కబ్జాకు యత్నిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రహరీపై రాసిన ఫోన్ నంబర్ల ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. కూల్చివేతలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శేఖర్, పర్యవేక్షకుడు సి.మోహన్, ఈఓలు అరుణకుమారి, నరేందర్, రెవెన్యూ అధికారి విక్రంరెడ్డితో పాటు రెండు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



దేవాదాయ శాఖ భూమిలో నిర్మించిన ప్రహరీని కూల్చివేస్తున్న అధికారులు

ఖాళీ భూములు స్వాధీనం చేసుకోవాలి..

దేవాదాయ శాఖకు చెందిన సర్వే నంబర్ 112,116, 125 లలోని మరో 22 ఎకరాల భూమిలో పెద్ద మొత్తంలో ప్లాట్లను కొనుగోలు చేసి గృహాలు నిర్మించుకున్నారు. అవి పోనూ మరో 8 ఎకరాల వరకు రియల్టర్ సంస్థ పేరుతో ఖాళీ స్థలాలు ఉన్నాయి. వాటితో పాటు ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. వాటిని కూడా దేవాదాయ శాఖ బోర్డులు ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకోవాలని మణికొండ మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు. సదరు భూమిలో నిర్మించిన గృహాలపై కోర్టుల్లో కేసులు కొనసాగుతున్నందున కోర్టు తుది తీర్పుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని వారు సూచిస్తున్నారు.

అన్ని శాఖలకు లేఖలు రాశాం: అరుణకుమారి, ఈఓ, దేవాదాయ శాఖ

నెక్నాంపూర్‌లోని దేవాదాయ శాఖ భూమిలో గృహ నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వద్దని మున్సిపాలిటీ, హెచ్‌ఎండీఏ, రిజిస్ట్రార్, విద్యుత్, జలమండలి, మున్సిపాలిటీ శాఖలకు లేఖలు రాశాం. అలాగే ఖాళీ స్థలాలను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేస్తాం . వెలిసిన గృహాల యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నాం. కోర్టుల్లో కేసులు ఉన్న సమయంలో నిషేధంలో ఉన్న భూములకు జరిగే రిజిస్ట్రేషన్లు, నిర్మాణ అనుమతులు ఇస్తే ఆయా శాఖల అధికారులపై నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తాం.

పంటల పరిశీలన

శంషాబాద్: మండలంలోని నానాజీపూర్ గ్రామంలో గల పంటలను వ్యవసాయ అధికారులు బృందం శుక్రవారం పరిశీలించింది. అదిక దిగుబడి సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అలాగు ట్రైకోడర్మా విరిడి, సుడోమోనాస్ ఫ్లోరోసిస్ మందుల వాడకంతో కలిగే ప్రయోజనాలను సూచించారు. ఏడీఏ దివ్యజ్యోతి, ఏఓ హిమబిందు, రైతులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ జయంతికి ఆహ్వానం



పట్నం మహేందర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ప్రతినిధులు

రాజేంద్రనగర్: ఏప్రిల్ 5వ తేదీన బీజేఆర్ చౌరస్తా (ఆరాంఘర్)లో నిర్వహించనున్న బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలకు హాజరు కావాలని రాజేంద్రనగర్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు పట్నం మహేందర్ రెడ్డిని శుక్రవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం, కోశాధికారి రగడంపల్లి శ్రావణ్, వ్యవస్థాపక అధ్యక్షుడు పోయిల జీవన్ దాస్, మాజీ అధ్యక్షుడు టి.ఆర్.శ్రీరాములు, గోల్కొండ రాజు కుమార్, పంబాల రాజు, పలుగుచెరువు మహేశ్, కోరని దయానంద్, బాబురావు, ప్రీతమ్ రాజ్, జాన్‌పాల్, కోరని మహాత్మ, బచ్చల మహేశ్, దాసరి రమేశ్, జంగయ్య, గోల్కొండ ఉపేందర్, బర్ల సుమన్, ఎడ్లకాడి చంద్రశేఖర్, గౌతమ్, లక్ష్మి, రమేశ్ గుంటి, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.